క్లుప్తంగా

పనికి తగిన వేతనం



యలకుంట్లలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

కనగానపల్లి: ఉపాధిహామీ పథకం కింద పనులు చేసే కూలీలకు పనికి వేతనం లభిస్తుందని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం యలకుంట్ల గ్రామంలో ఆయన ఉపాధిహామీ పనులు పరిశీలించారు. క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పని ప్రదేశాలకు వెళ్లి కూలీల హాజరుపట్టిక తనిఖీ చేశారు. కూలీలు సమయ పాలన, పని కొలతలు సక్రమంగా పాటిస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. నెమలివరంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడికి ఆర్థికసాయం



కార్మికుడు లింగన్నకు ఆర్థికసాయం అందిస్తున్న కౌన్సిల్ సభ్యులు

ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ కంపోస్టు యార్డులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు లింగన్న చేయికి ప్రమాదవశాత్తూ దెబ్బ తగలడంతో గాయపడ్డాడు. శుక్రవారం లింగన్న ఆపరేషన్ కోసం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రూ.58 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వార్డు సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయి కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయించాలి



మరుగుదొడ్డి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ బి.సుదర్శన్

తాడిమర్రి: మండలంలో శివంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను జిల్లా స్పెషల్ ఆఫీసర్ బి.సుదర్శన్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో మేజరు, మైనర్ పనులు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం తదితర ఆధునీకరణ పనులకు మంజూరైన నిధులపై ఆరా తీశారు. పనులు ఎందుకు అర్ధాంతరంగా ఆగిపోయాయని ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరుశురామ్‌ను అడిగి తెలుసుకున్నారు. మొత్తం రూ.12 లక్షల నిధులు విడుదలైనట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సమాధనం ఇచ్చారు. సిమెంట్ సమస్యతో నిర్మాణ పనులు ఆగిపోయాయని వివరించారు. వెంటనే పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ శివశంకర్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు బాగున్నాయా?

కదిరి టౌన్: కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గాండ్లపెంట ఎంపీడీఓ అంజినప్ప శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నరా? లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ల్యాబ్‌లు, బ్లడ్ బ్యాంక్, వార్డులు, మెడిసన్ రూమ్‌ను పరిశీలించారు. రోగులకు మంచి భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేటి నుంచి చిన్నమ్మ దేవత పరుష

నల్లమాడ: మండలంలోని తుమ్మలామల దుర్గంలో వెలసిన పసిబాల చిన్నమ్మ దేవత పరుష శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు వంకరకుంట గ్రామస్తులు శుక్రవారం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



ఆలయం ఎదుట హోమం చేస్తున్న పురోహితులు

ఓడీ చెరువు: మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం విద్యాగణపతి, వేలాయుధ సుబ్రహ్మణ్యం, అయ్యప్ప స్వామి విగ్రహాల ప్రతిష్ట ఘనంగా జరిగింది. పురోహితులు మాడుగల సత్యనారాయణ వరప్రసాద్, రంగనాథశర్మ, సురేష్‌శర్మ మంత్రోచ్చరణలతో హోమం చేపట్టారు. విగ్రహ దాత తహసీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపి, ఏఎస్ఐ కిశోర్ రెడ్డి, ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు పాల్గొన్నారు.

పంటకు రక్ష.. భూసార పరీక్ష

- మట్టి పరీక్షలతో మేలైన దిగుబడులు
- భూ స్వభావాన్ని బట్టి ఎరువులు వాడితే ఉత్తమ ఫలితాలు



మట్టిని సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

ఎన్పీకుంట: చాలా మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో? లేదో తెలుసుకోకుండానే పంటలు సాగు చేస్తుంటారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో నష్టపోతారు. అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తుంటారు. ఫలితంగా ఖర్చు పెరుగుతుంది. అయితే దిగుబడుల్లో కూడా మార్పు కనిపించదు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయాలనుకునే రైతులు మొదట భూసార పరీక్షలు చేయించుకుంటే భూమిలో ఎంత మేర భూసారం ఉంది? సూక్ష్మ, స్థూల పోషకాలు, ఖనిజ లవణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అంటున్నారు.

భూసార పరీక్ష అంటే..

పొలాల్లో సేకరించిన మట్టిని ప్రయోగ శాలల్లో భౌతిక, రసాయనిక పద్ధతులలో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయిని తెలుసుకుంటారు. వాటి ఫలితాల ఆధారంగా ఏ పంట సాగు చేయాలి? ఎంత మోతాదులో ఎరువులు వాడాలి అనే విషయాలు తెలుస్తాయి. పరీక్షల ద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుంది. పంట దిగుబడి పెరగడంతో పాటు రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు.

మట్టి సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంటకోత తరువాత వేసవిలో పంటలు లేని సమయంలో మట్టి నమూనాలు సేకరించాలి. నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తొలగించాలి. పార ద్వారా నమూనాలు సేకరించాలి. వ్యవసాయ పంటలకు ఆరు అంగుళాలతో 8 నుంచి 10 స్థలాల్లో మట్టి సేకరించారు. అనంతరం సేకరించిన మట్టిని కలిపి నేలమీద పరిచి నాలుగు భాగాలుగా చేయాలి. గుడ్డ లేదా పాలిథిన్ సంచిలో నింపి రైతు వివరాలు రాయడంతో పాటు పొలం సర్వే నంబర్, ఇంతకు ముందు పంటకు వాడిన ఎరువులకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. చివరాగా భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.

లాభాలు

రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షను మూడు సంవత్సరాలకు ఒకసారి చేయించుకోవడం మంచిది. భూసార పరీక్షల ద్వారా భూమిలోని చౌడు గుణాలను గుర్తించవచ్చు. లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వాడుకోవచ్చు

పరీక్షల కోసం మట్టిని తీసుకెళ్లారు

భూసార పరీక్షల కోసం నా పొలంలో నుంచి ఆర్బీకే సిబ్బంది మట్టి నమూనాలు సేకరించారు. మామిడి సాగు కోసం పరీక్షలు చేయించా. ఫలితం వచ్చిన తరువాత ఏ సాగుకు అనువైనదో చెబుతామన్నారు.

– ఎస్.మహబూబ్‌బాషా, రైతు ఎదురుదోన

నమూనాలు సేకరిస్తున్నాం



ఆర్బీకే సిబ్బంది ద్వారా పొలాల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపుతున్నాం. పరీక్షల అనంతరం రైతులకు సమాచారం ఇచ్చి భూమి స్వభావాన్ని బట్టి వాటిలో ఏ పంట వేసుకోవాలి? ఎలాంటి ఎరువులు వాడాలి తదితర అంశాలపై రైతులకు వివరిస్తాం. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకూ భూసార పరీక్షలకు 120 శాంపిళ్లను సేకరించడం జరిగింది.

– లోకేశ్వరరెడ్డి, ఏఓ ఎన్.పీ.కుంట

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఎన్పీకుంట: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ శుక్రవారం తెలిపారు. ఎన్.పీ.కుంట–1 సచివాలయం పరిధిలో పెద్దచెరువు మోరీకట్ట వద్ద ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా మొలకల పున్నమి



మొలకలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో శుక్రవారం మొలకల పున్నమి వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నవ ధాన్యాలను మొలకలుగా పోసి గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని ఏటా ఈ మొలకల పున్నమి వేడుకలను జరుపుకుంటామని గ్రామస్థులు తెలిపారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఏటి గంగమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద శుక్రవారం మొలకల పౌర్ణమి సందర్భంగా జాతర నిర్వమించారు. జాతరలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటి గంగమ్మ ఆశీస్సులతో మండల ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఏటి గంగమ్మ జాతరకు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి బలిజపేట, ఓబీఆర్‌రోడ్డు, ఎగువపేటలో అమ్మవారి గొడుగులను ప్రత్యేకంగా ఊరేగించారు. అలాగే అమ్మవారి చెల్లెళ్లు అయిన చింతల గంగమ్మ, గాండ్లపెంట గంగమ్మలకు సారె, చీరలు అందించి జాతరకు ఆహ్వానించారు. అనంతరం మహిళలు మొలక కుంపట్లను ఊరేగింపుగా అమ్మవారి చెంతకు తీసుకువచ్చారు. కార్యక్రమంలో సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ఎర్రమరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, ఏడీ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీధర్

ఓడీ చెరువు: మండలంలోని ఆకుతోటపల్లికి చెందిన రైతు వెంకటరమణప్ప (45) అప్పుల బాధ తాళలేక గత ఏడాది నవంబర్ 15న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం రైతు ఆత్మహత్యపై పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, వ్యవసాయశాఖ ఏడీ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీధర్, ఎస్ఐ గోపి విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలను మృతుడి భార్య నిర్మలమ్మ, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది పిల్లలు? ఎంత భూమి ఉంది? ఎంత అప్పు ఉంది తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. కుటుంబ జీవన పరిస్థితిపై ఆరా తీశారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగేంద్ర, వీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై సుదీర్ఘ చర్చ



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

నల్లమాడ: మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ దుంగావత్ సునీతా బాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. జగనన్న పక్కా ఇళ్ల నిర్మాణం, విద్యుత్, ఉపాధి హామీ, భూముల రీ సర్వే, వ్యవసాయం, ఆరోగ్యం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు సమావేశంలో వివరించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. వర్షాలు పడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సర్పంచులు రజనీకాంత్‌రెడ్డి, బొజ్జేనాయక్, ప్రసాద్, ఆనంద్‌నాయక్ తదితరులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రసూల్, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



కొత్తచెరువు: సంగమేశ్వర స్వామి రథోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు: సంగమేశ్వర స్వామి రథోత్సవానికి తరలివచ్చిన భక్తులకు శుక్రవారం కొత్తచెరువుకు చెందిన రాయల్‌యూత్ అసోసియేషన్, బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నాదానం చేశారు. అలాగే పలువురు గ్రామస్తులు అన్న ప్రసాదాలు, మజ్జిగను భక్తులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డప్ప రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దాల్ మిల్ సూరి, ఎస్ఐ లింగన్న, పార్టీ టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్, ఉపసర్పంచ్ యుగంధర్, అంగడి సత్తి, వెంకటరాముడు, యల్లప్ప, చంద్రాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం భక్తులు, ప్రజలకు అన్నదానం చేశారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం తల్లి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సత్కరించారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని రాంబాయికుంట వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. పనులకు సంబంధించి బిల్లులు బకాయిలు ఏమైనా ఉన్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతగా చేస్తే మంచి కూలి గిట్టుబాటు అవుతుందన్నారు.

నేటి నుంచి చింతమాను గంగమ్మ జాతర

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ కోటూరు చింతమాను గంగమ్మ జాతర శని, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. శనివారం రాత్రి బోనాలు, జ్యోతులు, మొలకలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఆదివారం రాత్రి భక్తులు బండమెరవణి చేస్తారని పేర్కొన్నారు.

నల్లగంగమ్మ జాతరకు విరాళం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో జరుగుతున్న నల్లగంగమ్మ జాతరకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శుక్రవారం రూ.10 వేలా విరాళం అందించారు. మొలకల పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు స్థానిక నల్లగంగమ్మ ఆలయంలో జాతర నిర్వహించనున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంపీపీ ఈటె రాము చేతుల మీదుగా విరాళం నగదును జాతర నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆటో కృష్ణ, రెడ్డప్ప తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

పుట్టపర్తి అర్బన్: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని పుట్టపర్తి ఎంపీడీఓ అశోక్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెడపల్లి 1, 2 సచివాలయాలను సందర్శించారు. రికార్డులు, అటెండెన్స్ రిజిష్టర్లు, సంక్షేమ పథకాల పోస్టర్లను పరిశీలించారు. ఎస్‌డీజీ గోల్స్‌కు సంబంధించి వివరాలపై ఆరా తీశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా బ్యాంకుల్లో రెన్యూవల్ సమయం కావడంతో రైతులు వస్తుంటారని వెంటనే అన్ని ధ్రువీకరణ పత్రాలను త్వరగా తీసి పంపాలన్నారు. హౌసింగ్‌తో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

వివాహిత మిస్సింగ్‌పై కేసు నమోదు

కనగానపల్లి: కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం వివాహిత మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. యలకుంట్లకు చెందిన వెంకటేష్ భార్య స్వర్ణ గురువారం రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. ఆమె కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా కనిపించకపోవటంతో, వారి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం



ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పట్నం గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడి సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని పేర్కొన్నారు. ప్రతిక్షణం పేదల సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని వెల్లడించారు. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మొత్తం 79 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యే అందేజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, సర్పంచ్ చలపతి నాయక్, అగ్రి అడ్వయిజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, సీనియర్ నాయకులు పట్నం గంగిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, ఎంపీడీఓ సుధామణి, హౌసింగ్ డీఈ షామీర్ పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ



పూజల్లో పాల్గొన్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం: పట్టణంలోని శివానగర్‌లో ఉన్న పురాతన బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథ స్వామి ఆలయం శుక్రవారం శివనామస్మరణతో మార్మోగింది. ఆలయంలో ధ్వజస్తంభం జీర్ణోద్ధరణలో భాగంగా నూతన ధ్వజస్తంభాన్ని దాతలు గుర్రం రాజ, గుర్రం రాధలు రూ.10 లక్షలతో ఏర్పాటు చేయించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు అతిథిగా ఎమ్మెల్యే సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి హాజరై, పూజలు నిర్వహించారు. చండీయాగం, శాంతి హోమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పురాతన కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ చేనేత ప్రముఖులు సిద్దిరాజేష్, కాచర్ల అంజి, ఉక్కిశిల గోవిందు, గడ్డం రంగ, లాయర్ క్రిష్ణ, రామచంద్ర, వడ్డే బాలాజీ పాల్గొన్నారు.


ఘనంగా చాందిని బండ్ల ఊరేగింపు




తిరునాలలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలో జరుగుతున్న యల్లమ్మ, నల్లగంగమ్మ తిరునాళ్లలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే నల్లగంగమ్మ జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన చాందిని బండికి వైఎస్సార్‌సీపీ బీసీ నేత బాలకృష్ణ నాయుడు ప్రత్యేక పూజలు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా యల్లమ్మ ఆలయానికి పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి రూ.20 వేలు విరాళంగా అందజేశారు. అలాగే కదిరి మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీకి చెందిన జయచంద్రకు వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.5 వేలు అందజేశారు. తిరునాల సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్లను ఊరేగించారు. నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, బాబాఫక్రుద్దీన్, కదిరి పట్టణ అధ్యక్షుడు బాహవుద్దీన్, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, గోవర్ధన్, నిర్వాహకులు శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణ, రాజు పాల్గొన్నారు.


పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం



నంజిరెడ్డి



ఆనంద్ నాయక్



ఆంజనేయులు

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 6 మండలాలతో పాటు పుట్టపర్తి రూరల్ మండలానికి పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపాయి. శుక్రవారం పుట్టపర్తి రూరల్ మండలం పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్‌గా నిడిమామిడికి చెందిన నంజిరెడ్డి, కో–కన్వీనర్లుగా పెడపల్లికి చెందిన ఆనంద్‌నాయక్, వెంగళమ్మ చెరువుకు చెందిన ఆంజనేయులును నియమించారు. పదవులు ఇచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



కదిరి టౌన్ అడపాలవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ షామీర్ బాషా

తనకల్లు: స్థానిక బూడిదగడ్డ వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ పూల నరసింహులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణ రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహాన్ని సక్రమంగా అందజేయాలని కార్యకర్త వెంకటమ్మకు సూచించారు.

కదిరి టౌన్: పట్టణంలోని అడపాలవీధి–1, ఇక్బాల్ రోడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను హౌసింగ్ డీఈ షామీర్ బాషా, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ శ్యామల శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, పిల్లల హాజరుపట్టిక, స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమాదేవి, విమల పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని యర్రగుంట పల్లిలో శుక్రవారం ఎంపీడీఓ శకుంతల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిచాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ గాయత్రికి సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. కార్యదర్శి రమణప్ప నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ దశరథ, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాధ, మణికంఠ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రజిత, ఏఎస్ఎం భాగ్యమ్మ, మహిళా పోలీస్ బాను పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

ధర్మవరం రూరల్: డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంతో నీటిని ఆదా చేయవచ్చని ఎంఐఓ శివశంకర్ రైతులకు సూచించారు. శుక్రవారం బత్తలపల్లి మండల కేంద్రంలో ఏపీఎంఐపీ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం, ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరలతో డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేస్తోందన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని సానేవారిపల్లిలో ఏపీఎంఐపీ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రిప్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఐఏఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రిప్ వాడకం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తోందన్నారు.కార్యక్రమంలో స్కిప్పర్ మెటజర్ కంపెనీ ప్రతినిధి మంజు పాల్గొన్నారు.